# 40 డిగ్రీల ఎండ....40 కి.మీల పాదయాత్ర

- 8 గంటల్లోనే కరీంనగర్ నుండి కొండగట్టుకు నడిచేలా బండి సంజయ్ ప్రణాళిక
- అంజన్న ఆశీర్వాద యాత్రకు ఏర్పాట్లు సర్వం సిద్ధం
- మేం సైతం.....కొండగట్టుకు వస్తామంటూ రాష్ట్రవ్యాప్తంగా కాషాయ శ్రేణుల ఫోన్లు
- భాజా భజంత్రీలతో.....కనీవినీ ఎరగని రీతిలో సక్సెస్ చేసేందుకు స్థానిక నేతల సన్నాహాలు
- 14న పొద్దున్నే 6 గంటలకు కరీంనగర్ మహాశక్తి ఆలయం వద్దకు చేరుకోనున్న కేంద్ర మంత్రి బండి సంజయ్
- దారి పొడవునా తాగునీరు, మజ్జిగ, పులిహోర అందించాలని స్వచ్ఛంద సంస్థల నిర్ణయం
- రాజకీయాలకు అతీతంగా కొనసాగే "అంజన్న ఆశీర్వాద యాత్రలో" పాల్గొనేందుకు భక్త మండళ్లు, భక్తులు నిర్ణయం
- 10వ తరగతి పరీక్షలకు ఇబ్బంది లేకుండా క్రమశిక్షణతో పాదయాత్రను సక్సెస్ చేయాలని బండి సంజయ్ విజ్ఞప్తి

**కరీంనగర్, ప్రజాబాట:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ''అంజన్న ఆశీర్వాద యాత్ర'' పేరిట ఈనెల 14న జరపతలపెట్టిన ''మహా పాదయాత్ర''కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కరీంనగర్ లో శుక్రవారం 38 నుండి 40 డిగ్రీల సెల్సియస్ మేరకు వాతావరణం వేడి ఉండబోతున్నట్లు వాతావరణ శాఖ చెబుతున్నప్పటికీ.....అవేవీ లెక్క చేయకుండా 8 గంటల్లో ఏకబిగిన 40 కి.మీల మేరకు కాలినడకన కొండగట్టుకు చేరుకునేందుకు బండి సంజయ్ సిద్ధమయ్యారు. పాదయాత్ర పొడవునా కొండగట్టుకు నడిచే వెళ్లే భక్తులకు ఇబ్బంది లేకుండా మంచి నీళ్లు, మజ్జిగ, పులిహోర సహా అన్ని ఏర్పాట్లు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, భక్త మండళ్లు ముందుకు వచ్చాయి. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నాయి.మరోవైపు మేము సైతం అంటూ రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు కరీంనగర్ బాట పట్టేందుకు సమాయత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ''అంజన్న ఆశీర్వాద యాత్ర'' సజావుగా సాగేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై గురువారంసాయంత్రం కరీంనగర్ లో బీజేపీ నాయకులు సమావేశమయ్యారు. బీజేపీ సీనియర్ నేత డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల ఇంఛార్జీ భండారి శాంతికుమార్, మోహన్ రెడ్డి, ఆయా జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపీ, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ కుమార్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పాదయాత్ర జరిగే ప్రాంతాల్లో పర్యటించారు. కొండగట్టు వద్దకు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు.

మరోవైపు ''అంజన్న ఆశీర్వాద యాత్ర''కు స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు సమాయత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కరీంనగర్ నుండి కొండగట్టు వరకు అడగడుగునా బండి సంజయ్ కు మంగళహారతులు, పూల జల్లులు, వీర తిలకంతో స్వాగతం పలికేందుకు ఆయా ప్రాంతాల ప్రజలు, మహిళలు, కాషాయ సైనికులు సిద్ధమయ్యారు. ఈ



నేపథ్యంలో కరీంనగర్ నుండి కొండగట్టు వరకు పెద్ద ఎత్తున అలంకరణ చేసే పనిలో కాషాయ శ్రేణులు నిమగ్నమయ్యాయి. ప్రధానంగా 10వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు జరుగుతున్నందున....పాదయాత్ర సందర్భంలో రోడ్డుపై ట్రాఫిక్ జాం కాకుండా క్రమశిక్షణతో నడుస్తూ అంజన్న ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కాషాయ శ్రేణులను కోరారు. అదే సమయంలో పాదయాత్రలో పాల్గొనే వారంతా ఈ 14న శనివారం ఉదయం 6 గంటలకే మహాశక్తి ఆలయానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా ఆధ్యాత్మిక భావన పెంపొందించేలా భక్తి పాటలు, డీజే సౌండ్, డప్పు సప్పుళ్లతో నభూతో నభవిష్యత్ అనేలా ''అంజన్న ఆశీర్వాద యాత్ర''ను విజయవంతం చేయాలని బండి సంజయ్ కుమార్ కోరారు. అంజన్న ఆశీర్వాద యాత్రలో పాల్గొనే వారందరికీ ఆద్యంతం ఇబ్బందుల్లేకుండా భోజన, ఇతరత్రా సౌకర్యాలు కల్పించేందుకు భక్తమండళ్లు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి.

**పాదయాత్ర ప్రారంభమయ్యేదిలా....**

14న ఉదయం 6 గంటలకు కరీంనగర్ లోని మహాశక్తి ఆలయం వద్దకు బండి సంజయ్ చేరుకుంటారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడికి చేరుకున్న కార్యకర్తలతో కలిసి కొండగట్టుకు కాలినడకన బయలుదేరుతారు. కొత్తపల్లిలో స్థానిక కార్పొరేటర్లు వాసాల రమేశ్, వేముల కవిత చంద్రశేఖర్, హరిప్రసాద్ పాదయాత్రకు ఘన స్వాగతం పలుకుతారు. అక్కడి నుండి రామడుగు, వెదిర, కురిక్యాల మీదుగా గంగాధర చేరుకుంటారు. అక్కడే స్థానిక వీఏఎస్ ఫంక్షన్ హాలులో కాసేపు సేద తీరుతారు. కార్యకర్తలంతా అక్కడే మధ్యాహ్నం భోజనం చేస్తారు. అనంతరం వెంకటయ్యపల్లి, పూడూరు, దొంగలమర్రి, మీదుగా కొండగట్టు ఘాట్ రోడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుండి నేరుగా అంజన్న ఆలయం వద్దకు వెళ్లి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు.



# 91లక్షలతో రాంపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**నిర్మల్, ప్రజాబాట:** నర్సాపూర్ మండలం రాంపూర్ గ్రామంలో రూ. 91 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఇందులో రూ.20 లక్షలతో రెండు S.H.G (VO) భవనాల నిర్మాణానికి, రూ. 20 లక్షలతో రెండు S.H.G (VO) వర్కింగ్ షెడ్ ల నిర్మాణానికి, రూ.36 లక్షలతో మూడు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి, రూ. 10 లక్షలతో ప్రైమరీ స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి, రూ. 5 లక్షలతో మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులు, ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మండల అధ్యక్షులు నరేందర్, గ్రామ సర్పంచ్ ప్రవీణ్, నాయకులు అర్జున్, మహిపాల్, శ్రీకాంత్ రెడ్డి, నారాయణ తో పాటు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డి లేకుంటే నేను ఎమ్మెల్యే గా లేను..

**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**

**హైదరాబాద్, ప్రజాబాట** బరువైన బాధ్యతను నమ్మకంతో సీఎం తో కలిసి కవ్వంపల్లి సత్యనారాయణపై పెట్టామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గురువారం గాంధీ భవన్ లో టీపీసీసీ ఎస్సీ విభాగ చైర్ పర్సన్ గా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పదవి స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, హాజరైన మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి,ఎమ్మెల్యేలు వేముల వీరేశం,లక్ష్మీ కాంత్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మేడిపల్లి సత్యం,నాగరాజు, వినోద్,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, ఫైనాన్స్ చైర్మెన్ రాజయ్య,ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి నర్సింహులు, జేబి రాజు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. పీసీసీ బలోపేతం కావాలనే ఉద్దేశ్యంతో కవ్వంపల్లికి పదవి, దళిత వాదంతో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్, రెడ్డికి సీఎం,బిసికి పీసీసీ అధ్యక్ష పదవి, దళితులు డిప్యూటీ సీఎం, స్పీకర్ పదవి,నాలుగు మంత్రి పదవులు కేవలం కాంగ్రెస్ లో మాత్రమే సాధ్యమన్నారు. 90 ఏళ్ల తర్వాత కుల సర్వే చేసి అఫిషియల్ డాక్యుమెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. క్లిష్ట సమయాల్లో దళితులు కాంగ్రెస్ పార్టీ కి అండగా నిలిచారు.. దళితులకు, ఆదివాసీలకు, బీసీలకు సముచిత స్థానం.. కెసిఆర్ రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల అప్పులో ముంచి పోయారన్నారు. 17 శాతం ఉన్న ఎస్సీలకు 5 ముఖ్యమైన స్థానాలు ఇచ్చాం.. రాబోయే పదవుల పంపకాల్లో ఎస్సీలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. రాజయ్యను అర్ధరాత్రి డిప్యూటీ సీఎం పదవి నుంచి కేసీఆర్ ఎలా తొలగించారో గుర్తు చేస్తున్నా.. సభ్యత్వ కార్యక్రమంలో రోజుకు 100 మంది చేరేలా కృషి చేయాలి... 100 సీట్లతో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాలుగు ముక్కలు అయ్యింది.. తెలంగాణలో బీజేపీకి చోటు లేదన్నారు. ఎస్సీ డిపార్ట్మెంట్ ను శక్తి వంతంగా తయారు చేయాలని కవ్వంపల్లికి సూచిస్తున్న.. రాబోయే ఎన్నికల్లో ఎస్సీ తరపున కవ్వంపల్లికి సూచించిన వారికి ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లన్నారు.

**తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడుతూ**

అడ్లూరి లక్ష్మణ్ కు మంత్రి పదవి రావడానికి నాదే ఘనత... మాదిగ ఎమ్మెల్యేలను ఢిల్లీ తీసుకపోయి సోనియా గాంధీని ఒప్పించి అడ్లూరి లక్ష్మణ్ కు మంత్రి పదవి ఇప్పించిన.. మాదిగ ఎమ్మెల్యేలను ఏక తాటిపై తీసుకొచ్చిన ఘనత దేశంలో నాదే.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తే టి ఆర్ ఎస్ లో నాకు టికెట్ ఇవ్వలేదు.. టి ఆర్ ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరి 50 వేల మెజారిటీ





తో గెలిచిన చరిత్ర నాది.. దళితులకు, ఆదివాసులకు ప్రమాదం పొంచి ఉంది.. దళితులు కూలిపోతున్నారు.. ఆదివాసులు అంతరించి పోతున్నారు.. ఎవడేవడో వేల కోట్లు దోచుకు పోతున్నారన్నారు.

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ..**

నాకు మంత్రి పదవి రావడానికి మందుల సామెలే కారణం.. మనకు ఎక్కడ మంత్రి పదవి ఇస్తారు అని చెప్పిన.. మాదిగ ఎమ్మెల్యేలను ఏకతాటిపై నిలబెట్టి డిల్లికి తీసుకపోయింది మందుల సామెల్.. నాకు వచ్చిన ఇబ్బందిని సంపత్ కుమార్ అండగా ఉండి పరిస్కారం చేశారు.. ఎస్సి సెల్ కాంగ్రెస్ కు గుండె కాయ లాంటిది.. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి దళితులే కారణం.. దేశంలో పేద వర్గాలకు అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీ... రాబోయే మూడు సంవత్సరాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ మళ్ళీ అధికారంలో వస్తుందన్నారు.దళితులకు ఏ కష్టం వచ్చినా అన్నగా మీకు అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు.

**మాన కొండూరు ఎమ్మెల్యే ,టిపిసిసి ఎస్సి విభాగం చైర్మన్ కవ్వం పల్లి సత్యనారాయణ మాట్లాడుతూ..**

సీఎం రేవంత్ రెడ్డి లేకుంటే నేను ఎమ్మెల్యే గా లేను.. డాక్టర్ సాబ్ అంటూ నాకు రేవంత్ రెడ్డి టికెట్ ఇచ్చారు కాబట్టే నేను ఎమ్మెల్యేను అయ్యాను.. రేవంత్ రెడ్డి చలువ తోనే నేను ఎస్సి విభాగం చైర్మన్ గా బాధ్యతలు చేపడుతున్న.. 19 మంది ఎమ్మెల్యేలు ఉంటే నలుగురికి రేవంత్ రెడ్డి మంత్రి పదవులు ఇచ్చారు.. సమాజం పట్ల సామాజిక బాధ్యత, స్పృహ ఉంది అని సీఎం రేవంత్ రెడ్డి నన్ను ప్రోత్సహించారు.. 59 కులాలకు చెందిన ఎస్సిలను ఏక తాటి పై తీసుకరాగలవని రేవంత్ రెడ్డి నాకు బాధ్యతలు ఇచ్చారు.. రేవంత్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకపోవడానికి నా వంతు ప్రయత్నం చేస్తా.. పదవుల్లో దళితులకు 18శాతం ఇవ్వాలని పీసీసి అధ్యక్షుడుకి విజ్ఞప్తి.. బ్యాక్ లాగ్ పోస్ట్ లు భర్తీ చేసేందుకు ప్రయత్నం చేస్తా.. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడుగా నలుగురు ఎమ్మెల్యేలు గెలవడానికి ప్రయత్నం చేసిన.. దళితులు ఎటు వైపు ఉంటే ఆపార్టీ అధికారంలోకి వస్తుంది.. దళితులు Trs వైపు ఉంటే trs అధికారంలోకి వచ్చింది.. దళితులు కాంగ్రెస్ వైపు ఉన్నారు కాబట్టే కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది.. తెలంగాణలో ప్రతి దళిత వాడాలో ప్రతి దళితుడు సభ్యత్వం తీసుకోవాలన్నారు.





# రాజకీయ పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం సంసిద్ధులవ్వాలి

**హనుమాన్ జంక్షన్ లోని హనుమాన్ ఆలయంలో నిర్వహించిన నిత్య అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**

**నిజామాబాద్, ప్రజాబాట:** హిందూ ధర్మం కాపాడడం కోసం హిందూ సైన్యమంతా ఏకమై మన సనాతన హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్క హిందువుపై ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. హిందువులు వారి వారి ఇష్టానుసారంగా వివిధ పార్టీలలో ఉన్నప్పటికీ వారి అంతిమ లక్ష్యం మాత్రం హిందూ ధర్మాన్ని కాపాడాల్సిందిగా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వినాయక్ నగర్ లోని హనుమాన్ జంక్షన్ లో గల శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఒకప్పుడు ఇందూరులోని వినాయక్ నగర్ లో ప్రత్యేకంగా ఏర్పడిన ఈ హనుమాన్ ఆలయం వల్ల ఈ ప్రాంతం హనుమాన్ జంక్షన్ గా పిలువ పడుతుందని అన్నారు. అది ఈ ఆలయానికి ఉన్న గొప్పతనం అని పేర్కొన్నారు. ఈ ఆలయ నిర్మాణంలో భాగంగా ఇక్కడి ప్రాంత వాసులు ముందుకు వచ్చి ఒక్కొక్కరి వద్ద చెందాలు జమ చేసి 54 ఫీట్ల భారీ హనుమాన్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారని ఇది ఇందూరుకే గర్వ కారణమని కొనియాడారు. నిజామాబాద్ లోని ప్రముఖ ఆలయాలలో ఈ ఆలయం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. అఖిలభారత హనుమాన్ దీక్ష పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీ మంగళ శాసనములతో హనుమాన్ దీక్ష స్వాములకు ప్రతినిత్యం బిక్ష (అన్నదాన ప్రసాదం) చేయబడుతుందన్నారు. ఈరోజు ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా హనుమాన్ భక్తులకు ఎమ్మెల్యే తన స్వ హస్తాలతో భోజనాన్ని వడ్డించారు.


